క్లుప్తంగా

శ్రీశైలానికి పాదయాత్ర



వెంకటాపురం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన బిణిగేరి గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరికి చెందిన 600 మంది గ్రామస్తులు పంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేపట్టి శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి మాట్లాడుతూ.. ఏటా కార్తీక మాసంలో శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్నామన్నారు. గ్రామస్తులతో కలిసి నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి అడవుల్లో రెండు రోజులు పాటు పాదయాత్ర సాగించి శ్రీశైలం చేరుకుంటామన్నారు. అక్కడ భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని బిణిగేరిలోని పంచలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పారు.

తుగ్గలి సర్పంచ్‌గా రవి

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి సర్పంచ్‌గా రవి బాధ్యతలు చేపట్టారు. రెండున్నరేళ్ల ఒప్పందంలో భాగంగా ఇదివరకు సర్పంచ్‌గా ఉన్న రామాంజనేయులు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సచివాలయంలో ఉప సర్పంచ్‌గా ఉన్న రవి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, సర్పంచ్ గౌరవ సలహాదారు నాగేంద్ర పాల్గొన్నారు.


వరి గడ్డికి డిమాండ్



నాగలదిన్నె వద్ద వరిగడ్డి తరలిస్తున్న దృశ్యం

నందవరం: తుంగభద్ర నది తీర ప్రాంతాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో వరి గడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం పశు గ్రాసానికి (వరి గడ్డికి) గిరాకీ పెరిగింది. నాగలదిన్నె, గురజాల, నదికైరవాడి, గంగవరం, జొహరాపురం. పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నదికైరవాడి గ్రామాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. ఎకరా వరి గడ్డి రూ.10 వేలు పలుకుతోంది. దైవందిన్నె, బూదురు, సూగూరు, హాలహర్వి, నందవరం తదితర గ్రామాలకు చెందిన పాడి రైతులు వరి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు.

టీబీ డ్యాంకు స్వల్పంగా ఇన్‌ఫ్లో



హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన ఉమ్మడి జలాశయం టీబీ డ్యాంకు బుధవారం ఇన్‌ఫ్లో 674 క్యూసెక్కులుగా నమోదైంది. సోమవారం కేవలం 78 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు రోజుల్లో కొంతమేర పెరిగింది. ఇక బుధవారం నాటికి డ్యాం నీటి మట్టం 1598 అడుగులతో 17.50 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అవుట్ ఫ్లో 9,677 క్యూసెక్కులుగా ఉంది. జిల్లాకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో ఆంధ్రా కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 592 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎంఎస్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రామకృష్ణ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శకుంతల బుధవారం తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీనివాసులును ప్రత్యేకంగా అభినందించారు.

పైపులైన్ పనులు పూర్తి చేయండి

ఆలూరు: తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో బుధవారం ఆయన ఏఈలతో సమావేశమయ్యారు. డీఈ మాట్లాడుతూ.. మొదటి విడత కింద దాదాపు 50 గ్రామాల్లో తాగునీటి పైప్ లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే ఆ గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మరో రూ 1.20 లక్షలతో 6 పనులకు టెండర్లు పిలవడం జరిగిందని డీఈ మల్లికార్జునయ్య తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకుల నుంచి శుద్ధి చేసిన తర్వాతనే నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

వ్యాయామమే సరైన చికిత్స

కృష్ణగిరి: అంగవైకల్యం ఉన్న చిన్నారులకు వ్యాయామమే సరైన చికిత్స అని ఫిజియోథెరఫీ వైద్యులు రవీంద్రనాయక్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఆయన అంగవైకల్యం గల చిన్నారులకు వ్యాయామం చేయించారు. పిల్లలకు ఇంటి వద్ద తల్లిదండ్రులు నిత్యం వ్యాయామం చేయించడం ద్వారా నరాలు బలపడి వైకల్యం నుంచి కొంత వరకు ఉపశమనం కలుగుతుందన్నారు. క్యాంపునకు అంగవైకల్యం కలిగిన పిల్లలను తల్లిదండ్రులు తప్పక తీసుకురావాలని ఆయన కోరారు. ఐఈఆర్‌టీ శేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి



కడిమెట్ల-2 లో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కడిమెట్ల గ్రామంలోని సచివాలయం -2 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, జెండాను ఎగరవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు రాజకీయ జీవితం ఇచ్చిన కడిమెట్ల పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నాడని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, రాష్ట్రం బాగుండాలన్నా మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ మారెప్ప, నాయకులు నాగభూషణంరెడ్డి, దయాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: పేదల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని సర్పంచ్ సోమన్న, ఎంపీటీసీ లోకనాథ్ రెడ్డి అన్నారు. బుధ వారం మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సచివాలయం-1లో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.19.54 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: రాంపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బోగోలు నాగభూషణరెడ్డి, సర్పంచ్ మనీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందజేసి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన లో వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు, ఈశ్వర రెడ్డి, ప్రతాపరెడ్డి, లాలన్న, చక్రవర్తి, మద్దిలేటి పాల్గొన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామ సచివాలయంలో సంక్షేమ వివరాల బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ విజయుడు ఆవిష్కరించారు. గ్రామ సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ. 32.53 కోట్లు అందించినట్లు తెలిపారు. కార్యదర్శి సంజప్ప, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి, మనోజ్‌లు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌గౌడ్, చాంద్‌బాషా, రాజారెడ్డి తదితరులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభు త్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. పేదల సంక్షేమానికికట్టుబడి ఉన్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చా రు. పంచాయతీ కార్యదర్శి రాముడులు పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో.. రాష్ట్రానికి వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కొండయ్య ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని లక్కసాగరం సచివాలయం పరిధిలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, నాయకులు ఆర్‌బీ వెంకటరాముడు, మహేశ్వరరెడ్డితో కలిసి గ్రామ సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం లాల్‌మాన్‌పల్లె గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింటికీ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. గ్రామ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.20 కోట్లు అందించినట్లు వివరించారు. పార్టీ నాయకులు మైదాన్, సురేష్, లక్ష్మిమాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హోసూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ శ్రేణులు

● **పత్తికొండ రూరల్:** మండల పరిధిలోని హోసూరు గ్రామంలో ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ నాగప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీటీసీలు నెట్టికల్, కేశప్ప, పార్టీ నాయకులు సోమశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రాంపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎం.అగ్రహారంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు



గుండ్లకొండలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లాల్‌మాన్‌పల్లెలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

● **నందవరం:** మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన గ్రామ సచివాలయం -1లో సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శించారు. పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం-1 పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.16.12 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీలు అతావుల్లా, యల్లమ్మ, కో ఆప్షన్ మెంబర్ షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



నాగలదిన్నెలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ లక్ష్మి



బిల్లేకల్లులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

● **ఆస్పరి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టి పథకాల గురించి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని బిల్లేకల్లు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. బిల్లేకల్లు పరిధిలో సంక్షేమ పథకాలు ద్వారా రూ.25 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు సుంకులమ్మ, ఎంపీడీఓ రాణెమ్మ, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

● **ఎమ్మిగనూరుటౌన్:** రాష్ట్రానికి సీఎంగా మళ్లీ జగనన్నను ఎన్నుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 15వ వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతు ఇచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, వార్డు కౌన్సిలర్ పూజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్షేత్రస్థాయి ప్రదర్శన



బనవాసి కేవీకేలో మొక్కలను పరిశీలిస్తున్న ఎస్ఎంఎస్ విద్యార్థులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక శ్రీ నీలకంఠేశ్వర జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులను బుధవారం బయోలజీ విజ్ఞాన పర్యటన నిమిత్తం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి తీసుకెళ్లారు. పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, హరికృష్ణ, ద్రాక్షాయని, దేవమణి, ఏస్తేరురాణి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల పెంపకం పద్ధతులను వివరించారు. కేవీకేలో పంటలు, షేడ్ నెట్‌లో మొక్కల పెంపకంపై క్షేత్రస్థాయి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, శాస్త్రవేత్తలు పంటలు, వాటి పెంపకం మెలకువలు వివరించారు.

అవి-ఇవి

28న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి ఒక రోజు ముందుగానే పంపించాలని అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

శివస్వాములకు భిక్ష ఏర్పాటు

వెల్దుర్తి(కృష్ణగిరి): శివ మాలధారణ చేపట్టిన స్వాములకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు జగదూర్తి చక్రపాణి రెడ్డి తెలిపారు. వెల్దుర్తి ప్రాథమిక పాఠశాల సమీపంలోని శివాలయంలో బుధవారం ఆయన శివ, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి మాల ధరించిన భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియమ నిష్ఠలతో చేసే దీక్ష మనిషి ప్రవర్తనలో మార్పు తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో పేరేముల సూర్యప్రకాష్‌రెడ్డి, బింగిదొడ్డి విక్రంసింహరెడ్డి, హరికృష్ణ, కమల్, యానాం హరి, అచ్యుత్ పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి- ఎల్లార్తి రోడ్డును బాగు చేసి బీటీ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. నెరణికి, ఎల్లార్తి తదితర గ్రామస్తులకు ఈ మార్గం నుంచి ఆదోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా ఉండేది. ప్రస్తుతం ఈ రోడ్డు కోతకు గురై, ముళ్లకంపలు పెరిగి రాళ్లు, రప్పలతో అధ్వానంగా మారింది. దీంతో ఎల్లార్తి, లింగంపల్లి తదితర గ్రామస్తులు వ్యవసాయ భూములకు, ఆదోని రోడ్డులో ఉన్న గ్రామాలతో పాటు ఆదోనికి వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కన్నడ, ఉర్దూ సంఘాల నిరసన

హొళగుంద: స్థానిక పాఠశాలలో చదువుతున్న కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆయా భాషలను సెకండ్ లాంగ్వేజ్‌లుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆ భాషా సంఘం నాయకులు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు శివన్నగౌడ్, గవి సిద్దప్ప, రుద్రగౌడ్, హమీద్, సుభాన్, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎం నజీర్ అహమ్మద్‌ను కలిసి కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ తరగతికి సీబీఎస్ఈ అమలు చేస్తూ తెలుగు లాంగ్వేజ్‌కు మాత్రమే అవకాశం కల్పించారని, అలాగే కన్నడ, ఉర్దూ లాంగ్వేజీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను అమలు చేస్తున్నామని హెచ్‌ఎం చెప్పగా అలా అయితే కన్నడ, ఉర్దూ చదువుతున్న విద్యార్థులు కర్ణాటక, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలకు దూరమౌతారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సీబీఎస్ఈలో తెలుగుతో పాటు కన్నడ, ఉర్దూ మీడియంలను అలాగే కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి



పెద్దకొత్తిలిలో రైతులతో కలిసి మునగ పంటను పరిశీలిస్తున్న సీడీసీఎల్ఆర్‌సీ సుజాత

నందవరం: జాబ్ కార్డు ఉన్న రైతులు ఉద్యాన పంటలైన మునగ, పూలతోటలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మిగనూరు క్లస్టర్ డైరెక్టర్ (సీడీసీఎల్ఆర్సీ) సుజాత సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, ముగతి గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలోని హార్టికల్చర్ సాగులో భాగంగా మునగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు 100 శాతం రాయితీ కల్పించిందన్నారు. మునగ సాగుకు ఎకరానికి 448 మొక్కలు, పావు ఎకరానికి 112 మొక్కలు అందిస్తుందన్నారు. అలాగే 25 సెంట్లకు 27,495, ఎకరానికి రూ.లక్ష చొప్పున రెండు సంవత్సరాలు దశల వారీగా అందిస్తారని వివరించారు. అలాగే 100 రోజులు పని దినాలు కల్పిస్తారని తెలిపారు. ప్రస్తుతం పెద్దకొత్తిలి గ్రామాల్లో మునగ పంట బాగుందని, మంచి దిగుబడులు వస్తున్నాయన్నారు. ఈ పంట ద్వారా రైతులకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు లాభం వస్తుందని వివరించారు. మునగను సంప్రదాయ వైద్య వ్యవస్థలో ఉపయోగిస్తారని పేర్కొన్నారు. అలాగే వ్యాధులను దూరం చేస్తుందని, రక్తహీనత, అధిక రక్తపోటు, బాలింతల్లో పాల ఉత్పత్తి పెంపు, కాలేయ సంబంధిత వ్యాధులను అరికట్టేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ వీరేష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

రూ.1.32 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకులు

మద్దికెర: మండల కేంద్రంలోని సాయినగర్, రాంనగర్ కాలనీలలో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలతో పాటు ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. గతంలో ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇచ్చిన హామీ మేరకు ట్యాంకులు నిర్మించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతంలో ట్యాంకు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు సహకారం అందించాలని కోరారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆలూరు విద్యుత్ ఏఈ లోకేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గృహ వినియోగదారుల బాకాయిలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ బకాయిలు వసూలు చేయాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోపు కరెంటు బిల్లులు వసూలు చేయాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత లైన్‌మెన్‌కు తెలియజేయాలన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

గోనెగండ్ల: రాష్ట్రంలో విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పేర్కొన్నారు. బుధవారం గోనెగండ్లలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహులు, రామన్, ఖాజా మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు విద్యార్థి సమస్యలు, విద్యారంగ సమస్యలపై చేసిన పోరాటాలు, ఉద్యమ నేపథ్యం గురించి, ప్రభుత్వం విద్యపై తీసుకుంటున్న విధానాల వల్ల కలిగే లాభనష్టాల గురించి వివరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పవన్, కార్యదర్శిగా రంగస్వామి, ఉపాధ్యక్షులుగా ఉసేన్, ఖాసీం, లాజర్, స్వర్ణలత మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

కృష్ణగిరి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ రాజేశ్వరి బీఎల్ఓలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. జాబితాలో తొలగించే ఓట్లకు సంబంధించి అన్ని ఆధారాలను పక్కాగా సేకరించిన తర్వాతే తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, ఇందులో నిర్లక్ష్యం తగదన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

హాలహర్వి: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో సర్పంచ్ మోకా సిద్ధమ్మ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలన స్వర్ణయుగంలా సాగుతోందన్నారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపారని చెప్పారు. విరుపాపురం గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.18,18,59,425 మొత్తాన్ని లబ్దిదారులకు అందించినట్లు వివరించారు. సుపరిపాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాల చేరిక

గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, మల్లయ్య, పంపన్నగౌడ్, బసవరాజు, శివప్ప, గాదిలింగప్ప, హనుమంతప్ప, కాళింగ, మల్లయ్య, హనుమంతప్పలతో పాటు 40 కుటుంబాల ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి గుమ్మనూరు నారాయణస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగనన్న పాలన, చేసిన అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

రెడ్‌క్రాస్ కమిటీ ఎన్నిక



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వెల్దుర్తి సబ్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. తహసీల్దార్/సొసైటీ అధ్యక్షుడు శివరాముడు, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా ట్రెజరర్ రఘునాథ రెడ్డి సమక్షంలో నూతన కమిటీ చైర్మన్‌గా కేపీ ఆచారి, సెక్రటరీగా రఘునాథ్, వైస్ చైర్మన్‌గా కేవీ రమణాచారి, ట్రెజరర్‌గా పరమేశ్, ఇతర ఎక్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ అభివృద్ధికి పాటు పడుతూ మెరుగైన సేవలందించాలని జిల్లా కమిటీ ప్రతినిధులు సూచించారు. వెల్దుర్తి సొసైటీ సబ్‌బ్రాంచ్‌లో కొన్నేళ్లుగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నిర్వహణపై అభినందనలు తెలిపారు. అనంతరం సబ్‌బ్రాంచ్ వద్ద జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రతినిధులు జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, దేవరాజ్, ఈఓ నాగేశ్వరరావులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం గోపి, పీఈటీ

హాలహర్వి: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపికైయినట్లు హెచ్ఎం గోపి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నంద్యాల జిల్లా మిడుతూరులో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కర్నూలు జిలా జట్టు మొదటి స్థానం సాధించిందన్నారు. ఈ పోటీల్లో గూళ్యం పాఠశాల విద్యార్థిని డి.హారిక ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో శశిధర్, శంకర్, భారతమ్మ మంచి ప్రతిభ కనబరిచారన్నారు. వారిని బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పీఈటీ ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు - నేడు.. రోడ్డు చూడు



నాడు : బురదమయంగా ఉన్న రోడ్డు



నేడు: సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం

మద్దికెర: మద్దికెర నుంచి మొలగవెల్లికి వెళ్లే మార్గంలో 15 ఏళ్ల కిత్రం తారు రోడ్డు వేశారు. రైల్వే లైను అవతలి వరకే రోడ్డు వేసి నిలిపి వేయడంతో మొలగవెల్లికి వెళ్లే దారిలో మద్దికెరకు చెందిన రైతుల పొలాలు దాదాపు 20 వేల ఎకరాలు వుండడంతో నిత్యం రైతులు, ఆలూరు, మొలగవెల్లికి వాహనదారులు ఇబ్బందులు పడేవారు. వానలు వచ్చాయంటే రోడ్డు బురదమయంగా మారేది. అయితే అక్టోబర్ 5వ తేదీ మండలంలోని బురుజుల గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మద్దికెరలోని రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు సమస్యను స్థానికులు ఎంపీ సంజీవ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లో సీసీ రోడ్డు నిర్మించి రోడ్డును కలిపారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.